సాక్షి తిరుపతి

సోమవారం । 12 । మే । 2025



'శ్రీహరి'.. కూల్చివేతే సరి!

తిరుపతిలోని శ్రీహరి బస్టాండ్‌ను కూల్చివేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. - 8లో



కుయుక్తులతో కూటమి కుమ్మక్కు!

శ్రీకాళహస్తీశ్వరాలయ పార్కింగ్ టెండర్‌ను కూటమి నేతలు కుమ్మక్కై.. కుయుక్తులతో దక్కించుకున్నారు. - 8లో



విలువలే వెంగమాంబ రచనలు

తరిగొండ వెంగమాంబ జయంతోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుపతిలో సాహితీ సదస్సు నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరించనున్నారు. గ్రీవెన్స్‌కు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

వేదనారాయణుని సేవలో న్యాయమూర్తి



ఆలయంలో న్యాయమూర్తి అర్చన

నాగలాపురం: వేదవల్లీ సమేత శ్రీవేదనారాయణ స్వామి వారిని ఆదివారం తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి జి.అర్చన సేవించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి చెంగల్‌రాయులు, ప్రధాన అర్చకుడు నాగరాజు భట్టాచార్యులు, ఎస్ఐ సునీల్ పాల్గొన్నారు.

పీజీ కోర్సులకు దరఖాస్తుల వెల్లువ



ఎస్వీయూలోని ఏపీ పీజీ సెట్ కార్యాలయం

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఏపీ పీజీసెట్-2025 దరఖాస్తుల గడువు ఆదివారంతో ముగిసింది. అపరాధ రుసుముతో ఈనెల 25వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. 153 కోర్సులలో సుమారు 25వేల సీట్లు ఉండగా ఇప్పటి వరకు 24,900 దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది పీజీసెట్‌కు 32వేలకు పైగా దరఖాస్తులు రాగా ఈఏడాది 7వేలు తగ్గడం గమనార్హం. దరఖాస్తు చేసుకుని అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి పీజీ సీటు దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జూన్ 9 నుంచి పరీక్షలు

జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు ఏపీ పీజీసెట్- 2025 నిర్వహించనున్నట్లు ఎస్వీయూ వీసీ అప్పారావు, కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశర్లు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 కేంద్రాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అర్ధరాత్రి హాహాకారాలు



ప్రమాదానికి గురైన బస్సు (ఇన్‌సెట్‌లో) గాయపడిన కండక్టర్

- కల్వర్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- 25 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- వేలూరు నుంచి తిరుమలకు వస్తుండగా ఘటన

చంద్రగిరి: అర్ధరాత్రిలో హాహాకారాలు మిన్నంటాయి. కల్వర్టును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో సుమారు 25 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి, అగరాల వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తిరుమల డిపో ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో ఆదివారం రాత్రి వేలూరు నుంచి తిరుమలకు పయనమైంది. బస్సు డ్రైవరు నిద్రమత్తులోకి జారుకోవడంతో అగరాల నారాయణ కళాశాల వద్ద రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. ఒక్కసారిగా బస్సు ప్రమాదానికి గురి కావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. చిమ్మచీకటి కారణంగా ఏం జరిగిందో.. ఎవరు గాయపడ్డారో తెలియక హాహాకారాలు పెట్టారు. పలువురు తీవ్ర గాయాలకు లోనయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది అక్కడికి చేరుకుని హుటాహుటిన క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. వీరిలో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వీరిలో బస్సు డ్రైవర్ రాజారెడ్డి, కండక్టర్ లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్, దీపారాణి, నితీష్‌కుమార్, అక్షయ్‌కుమార్, తిరుసడై, తేజస్విని, రామ్‌లక్ష్మి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. వీరంతా రుయాలో చికిత్స పొందుతున్నారు. వీరు కాకుండా మరికొందరిని చంద్రగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.





తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గుండె చెరువు!



వడమాల పేట మండలం ఎస్‌బీఆర్‌పురం చెరువును టీడీపీ నేతలు ఆక్రమించి పూడ్చేస్తున్న దృశ్యం

ఏ చెరువులోనూ సెంటు భూమిని కూడా ముట్టుకునే అధికారం కలెక్టర్‌కు సైతం లేదు. ప్రజా ప్రతినిధులకు సైతం వాటిని ప్రోత్సహించే హక్కు లేదు. ప్రజా అవసరాల కోసం చెరువు స్థలం వినియోగించాలంటే చట్టపరమైన విధి విధానాలను పాటించడం తప్పనిసరి. చెరువుల పరిరక్షణపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలివి.

చెరువు చుట్టూ పదూళ్లకు ఆదరువు.. చెరువే మనుగడకు ఆధారం..తొలకరికి ఆవాసం.. సిరులకు ప్రాకారం.. చెరువే సమస్తం.. మన నేస్తం.. అలాంటి నీటి వనరులను అభివృద్ధి చేసి వినియోగించుకోవాలి. అయితే వాటికి రక్షణ లేకుండా పోతోంది. పైగా అవి అక్రమణలకు అడ్డాగా మారుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు కళ్లున్న ధృతరాష్ట్రుల్లా చేష్టలుడిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫలితంగా వందలాది ఎకరాల విస్తీర్ణంతో అలరారే చెరువులు చిక్కి శల్యమై.. చివరకు కనుమరుగవుతున్నాయి.

అడిగేదెవరు.. ఆపేదెవరు?

- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చెరిగిపోతున్న చెరువుల హద్దులు
- నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు
- యథేచ్ఛగా ప్లాట్లు వేసి విక్రయాలు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



చిట్టమూరు మండలం జంగాలపల్లె చెరువులో ఆక్రమణలు

చిత్తూరు కలెక్టరేట్ : చెరువు అంటేనే రైతాంగానికి, నీటి నిల్వలకు కల్పతరువు. కానీ అవే చెరువులు మరి కొద్ది రోజుల్లో పుస్తకాల్లో మాత్రమే చదువుకునే స్థితికి చేరుకునేలా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కబ్జాలకు గురవుతున్నాయి. రెండు జిల్లాల్లో వేల సంఖ్యలో చెరువులు ఆక్రమణల చెరలో పడినట్లు చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు వెల్లడిస్తున్నారు. ఈ లెక్కన కనిపించకుండా పోవడానికి మరెంతో కాలం పట్టేట్టు లేదు. ఇటీవల పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో చెరువుల పరిరక్షణకు తీసుకొచ్చిన హైడ్రా చట్టం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి సర్కారు చెరువులు కబ్జాకు గురవుతున్నా చూసీ చూడనట్టు మిన్నకుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇష్టారాజ్యంగా మింగేస్తున్నారు!

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పట్టణాలు, నగరాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఆక్రమణదారులు చెరువుల్ని మింగేస్తున్నారు. వందల సంఖ్యలో జల వనరులు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు తాగు నీటి అవసరాలు తీర్చిన వాటిలో కొన్ని ఆక్రమణల పాలై కనుమరుగు కాగా మరికొన్ని మురుగునీటి కాసారాలుగా మారుతున్నాయి. గట్లు, కాలువతో పాటు చెరువుల భూములను ప్లాట్లుగా మార్చేస్తున్నారు. చెరువుల్లో ఏర్పాటు చేసిన వెంచర్లతో రూ.వందల కోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోంది.



మాదనపాళెం చెరువులో నిర్మించిన ఇళ్లు

ఆక్రమణల పర్వం ఇలా..

- తిరుపతి నగరంలోనే 8 చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు పార్టీలకు చెందిన నేతలు పోటాపోటీగా ఆక్రమించేస్తున్నారు. కొందరు నేతలు రెవెన్యూ అధికారులకు ముందే చెబుతున్నారు. ఆ ప్రాంతంలో ఖాళీగా ఉన్న చెరువు స్థలాన్ని ఆక్రమిస్తున్నాం. దాని జోలికి రాకండి అంటూ ఆదేశిస్తున్నారు. దీంతో కొందరు రెవెన్యూ అధికారులు ఆక్రమణలపై తమకు సమాచారం ఉన్నప్పటికీవాటి జోలికి వెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నాచెరువు 77.46 ఎకరాలు, శెట్టిపల్లె చెరువు 55.25 ఎకరాలు, చెన్నాయగుంట 52.56 ఎకరాలు, పాన్ చెరువు 49.40 ఎకరాలు, కొరమీనుగుంట 32.20 ఎకరాలు, పూలవాని గుంట 23.82 ఎకరాలు, గొల్లవాని గుంట 29.04 ఎకరాలు, మంగళం చెరువు 75.98 ఎకరాలు ఉంది. మొత్తంగా 8 చెరువుల విస్తీర్ణం 395.71 ఎకరాలు అయితే ఇందులో 100 ఎకరాలకు పైగానే ఆక్రమణలకు గురైంది.
- చిట్టమూరు మండలం జంగాలపల్లెలోని సాగు నీటి చెరువు 15 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఆ చెరువు స్థలాన్ని నాయుడుపేటకు చెందిన వ్యక్తులు ఆక్రమించుకున్నారు.
- వాకాడు మండలం వాకాడు చెరువు విస్తీర్ణం సుమారు 156 ఎకరాలు. అందులో 50 ఎకరాల వరకు రైతులు ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు.
- సత్యవేడు మండలం మాదనపాళెంలోని చెరువు ఆక్రమణకు గురవుతోంది. సర్వే నంబర్ 839లోని 11 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది . అది రోడ్డుకు ఆనుకుని ఉండడంతో అక్రమంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. అధికారులు ఈ విషయం గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.
- సత్యవేడు మండలం మాదనపాళెం గ్రామంలోని చెరువు ఆక్రమణ చెరలో చిక్కుకుంది. కొందరు

2వేల వరకు కబ్జా కోరల్లో..!

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మొత్తం 8,063 చెరువులు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఇందులో దాదాపు 2 వేల చెరువులు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. వీటిలో అత్యధికంగా రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన కబ్జాలే ఎక్కువ. సామాన్యుడు చెరువు గట్టుపై చిన్న పాక వేస్తే అధికారులు వెంటనే స్పందిస్తారు. ఆగమేఘాలపై వాటిని తొలగించేస్తారు. అదే ఆక్రమణలకు పాల్పడిన కూటమి ప్రజాప్రతినిధుల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

40 హెక్టార్లలోపు విస్తీర్ణం గల చెరువులు	7,395
ఆయకట్టు	1,36,609.53 ఎకరాలు
40 హెక్టార్లకు మించినవి	668
ఆయకట్టు	1,69,218.09 ఎకరాలు
రెండు జిల్లాల్లో మొత్తం చెరువులు	8,063
మొత్తం ఆయకట్టు	3,05,827.62 ఎకరాలు

కబ్జాలకు కారణాలివే..

- అధికార యంత్రాంగం ఉదాసీనత.
- చెరువుల సరిహద్దులు నిర్దేశించకపోవడం.
- చిత్తూరు, తిరుపతి నగరాల్లో భూములకు భారీ డిమాండ్ రావడం.
- తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లను అడ్డుకోలేక పోవడం.
- రెవెన్యూ, ఇరిగేషన్, పురపాలక, నగరపాలక అధికారుల మధ్య సమన్వయలోపం.
- చట్టంలోని లొసుగుల కారణంగా ఆక్రమణలు గుర్తించినా తొలగించే పరిస్థితి లేకపోవడం.
- చెరువును పూడ్చి అందులో అక్రమంగా నిర్మించిన నివాసాలకు విద్యుత్,నీటి వసతి కల్పించడం.
- అధికార పార్టీకి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులే పలుచోట్ల చెరువుల్లో వెంచర్లు వేయడం.
- వరదలొచ్చి మునిగినప్పుడే తప్ప మిగిలిన సమయాల్లో అధికారులు ఆక్రమణలపై దృష్టి పెట్టకపోవడం.



తిరుపతిలో ఆక్రమణకు గురైన చెన్నాయగుంట చెరువు



కబ్జాకు గురైన సత్యవేడు మండలం మాదనపాళెం చెరువు

అక్రమార్కులు దర్జాగా ఇళ్ల నిర్మాణం చేపట్టేశారు. మాదనపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 839లో 11 ఎకరాల విస్తీర్ణంలో ఇరిగేషన్ చెరువు ఉంది. దీని ఆయకట్టు భూములను శ్రీసిటీ సెజ్‌కు కేటాయించారు. ఇదే అదునుగా కబ్జాదారులు రెచ్చిపోయి అక్రమ నిర్మాణాలు చేపట్టారు.

తుమ్మలగుంట జోలికొస్తే..ఎందాకైనా!



'తుమ్మలగుంట జోలికొస్తే.. ఐక్యంగా పోరాడతాం.. మా ఊరి అభివృద్ధిపై జరుగుతున్న కుట్రను ఎండగడతాం.. రాజకీయాలకు అతీతంగా గ్రామంలో జరిగిన అభివృద్ధిని ఎవరో వచ్చి చెరిపేస్తాం.. తుడిచేస్తాం.. ఎవరికో అప్పగించేస్తామంటే చూస్తూ ఊరుకోం.. ఎదురు తిరుగుతాం.. అవసరమైతే రోడ్డెక్కుతాం.. ప్రధానంగా కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ మా గ్రామానికి ఒక మణిహారం.. ఆ స్థలం మాది.. దానిపై హక్కు మాది.. ఇంతకుముందే గ్రామసభలో తీర్మానం చేశాం.. ఇప్పుడు గ్రామమంతా ఏకమై ఒకచోటకు వచ్చింది.. రాష్ట్రంలో విశాఖపట్నం తర్వాత అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలున్న ఏకైక క్రీడామైదానం అది. అలాంటి పార్క్‌ను వేరెవరికో అప్పగిస్తామంటే ఒప్పుకునేది లేదు.. చెవిరెడ్డి కష్టాన్ని వృథా కానీయం..' అంటూ తుమ్మలగుంట గ్రామస్తులు ముక్త కంఠంతో గర్జించారు.



సమావేశమైన తుమ్మలగుంట వాసులు

- ఐక్యంగా ఎవరినైనా ఎదిరిస్తాం
- వృథా కాదు.. చెవిరెడ్డి కష్టం
- ఒకే వేదికపై ముక్త కంఠంతో గర్జించిన గ్రామస్తులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట గ్రామంలోని కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ నిర్వహణ బాధ్యతను పంచాయతీ నుంచి తిరిగి తుడా తీసుకునే ప్రయత్నాలను గ్రామస్తులు వ్యతిరేకించారు. పార్క్‌ను తమ గ్రామం నుంచి ఎందుకు దూరం చేయాలని అనుకుంటున్నారు..? దాని వెనుక కుట్ర ఏమిటి..? వాటిని ఎలా ఎదుర్కోవాలి..? అనే అంశాలపై చర్చించేందుకు గ్రామస్తులు ఆదివారం సాయంత్రం వేలాదిగా తరలి వచ్చి ఒక చోట సమావేశమయ్యారు. ఆ సభకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ అభివృద్ధికి తాను పడిన కష్టం, ఎదుర్కొన్న విమర్శలను వివరించారు. తల్లివంటి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి జెడ్పీటీసీ సభ్యుడిగా రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి నేటి వరకు చేసిన కృషిని క్షుణ్ణంగా తెలియజేశారు. చేయగలిగినంత అభివృద్ధి చేశానని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాత్రం గ్రామస్తులకే వదిలేస్తున్నానని చెప్పారు. గతంలో నాలుగేళ్లు కష్టపడి అభివృద్ధి చేసిన ఓ పార్క్‌ను తుడాకు అప్పగిస్తే నాలుగు నెలలకే నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ చెవిరెడ్డి చేసిన అభివృద్ధిని ఎట్టి పరిస్థితుల్లో గ్రామ పొలిమేర దాటనీయమని, అందుకోసం ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అందరూ ఒక్కటై అడ్డుకుంటామని వెల్లడించారు. ఈ అంశంపై ఎవ్వరు ఏమన్నారంటే...

తమాషాగా ఉందా?



తుమ్మలగుంట అంటే తమాషాగా ఉందా..? మా ఊరు జోలికి వస్తే ఎవరూ వదలరు.. మా గ్రామ అభివృద్ధి చూసి ఓర్వలేకనే ఇదంతా చేస్తున్నారు. కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ వల్ల మా గ్రామం ఎంతలా అభివృద్ధి చెందిందో దేశ మంతా తెలుసు. ఆ పార్క్‌ను ఎవరికో ఇచ్చేస్తామంటే ఒప్పుకుంటామా..? ఎవరినైనా ఎదిరిస్తాం.. ఎంతవరకైనా పోరాడతాం. - రత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యులు, తిరుపతి రూరల్

భూమి మాది.. హక్కు మాది



తుమ్మలగుంటలో ఏర్పాటు చేసిన గోవిందధామం అయినా.. కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ అయినా వాటికి కేటాయించిన భూమి మా గ్రామానికి చెందింది. దానిపై హక్కు మా ఊరి ప్రజలకే ఉంటుంది. అక్కడ జరిగిన అభివృద్ధిని ఎవరికో అప్పగించేస్తాం.. నాశనం చేసేస్తామంటే చూస్తూ ఊరుకోం. గ్రామంలో ప్రజలందరం ఏకమై పోరాడతాం. - దామోదర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్

మా ఊరి జోలికి రావద్దు



మా ఊరి జోలికి ఎవరూ రావద్దండి.. మా గ్రామంలోని కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌ను ఎంతో మంది మెచ్చుకుంటున్నారు. ఇంత అ ద్భుతంగా తయారు చేయడం ఎవరికీ సాధ్యం కా దని చెప్పడం చూస్తుంటే మాకు ఆనందంగా ఉంటుంది. అంతలా కష్టపడిన చెవిరెడ్డిని మా గ్రా మం ఎన్నటికీ మరవదు. రాజకీయాలు మాకు అవసరం లేదు. ఎవరైనా సరే గ్రామంలో అభివృద్ధి చేయాలే తప్ప చేసిన పనులు దూరం చేస్తామంటే కుదరదు. - బుజ్జమ్మ, ఎంపీటీసీ సభ్యులు, తుమ్మలగుంట

ఎంత దూరమైనా వెళతాం



తుమ్మలగుంట గ్రామస్తుల ఐక్యత ఎలా ఉంటుందో చూపిస్తాం. అభివృద్ధిని కాపాడుకోవడంలో ఎంత దూరమైనా వెళతాం. మా గ్రామం జోలికి వస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు. మా గ్రామానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగారు. అది మాకు గర్వకారణం. ఆయన చేసిన అభివృద్ధిని దూరం చేస్తామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు. మా గ్రామ చరిత్రలో చెవిరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. - గోవిందరెడ్డి, మాజీ ఉపసర్పంచ్, తుమ్మలగుంట

అభివృద్ధిని తుడిచేయాలంటే అడ్డుకుంటాం



తిరుపతి నగరం కంటే తుమ్మలగుంటలో నివాసముండాలని ఎంతో మంది విశ్రాంత ఉద్యోగులు మా గ్రామానికి వస్తున్నారు. చెవిరెడ్డి అద్భుతంగా తయారు చేసిన అభివృద్ధి పనులతో ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. అలాంటి అభివృద్ధిని తుడిచేయాలని చూస్తే అడ్డుకుంటాం. చెవిరెడ్డి చేసిన అభివృద్ధిలో ప్రధానమైనది కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ ఒకటి. ఆ పార్క్‌ను మా పంచాయతీకి దూరం చేస్తామంటే ఎలా ఊరుకుంటాం.. - గీతమ్మ, తుమ్మలగుంట నివాసి

తుడాకు ఏం సంబంధం



తుమ్మలగుంట గ్రామానికి కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ ఒక మణిహారం. ఆ పార్క్ నిర్మాణం జరిగింది మా గ్రామానికి చెందిన భూమిలోనే. ప్రజలు తుడాకు కట్టిన పన్నులతో అభివృద్ధి చేశారు. ప్రభుత్వం నుంచి తుడాకు వచ్చిన నిధులు ఏమీ లేదు కదా..? మా గ్రామస్తులే కాదు ఈ విషయంలో ఎంతటి వారినైనా ఎదుర్కొంటాం. - సుబ్బరామిరెడ్డి, సర్పంచ్, తుమ్మలగుంట

సమష్టిగా పోరాడతాం



తుమ్మలగుంట అభివృద్ధిలో రాజకీయ కక్షలు వద్దు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం. గెలిచిన వారికి చేతనైతే మా గ్రామమంలో మరింత అభివృద్ధి పనులు చేయాలి. చేసిన వాటిని పంచాయతీకి దూరం చేస్తామంటే ఒప్పుకోం. అడ్డుకునేందుకు సమష్టిగా పోరాడతాం. - రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్, తుమ్మలగుంట

గతంలో మోసపోయాం



గతంలో మా గ్రామం నుంచి ఒక పార్క్‌ను తుడా నిర్వహిస్తామంటే అప్పగించాం. నాలుగు నెలలకే సర్వనాశనం చేసేశారు. పార్క్‌ల నిర్వహణ తుడాకు కష్టమని తెలిసినా రాజకీయ కక్షలతో ఆహ్లాదకరమైన కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌ను పంచాయతీ నుంచి దూరం చేయాలని చూస్తున్నారు. - జయచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్, తుమ్మలగుంట

నాశనం చేస్తామంటే ఒప్పుకోం



జాతీయ స్థాయి ఆటల పోటీలు నిర్వహించేందుకు క్రీడాకారులకు అనువైన పార్క్ మా గ్రామంలో ఉందంటే అది మాకు గర్వకారణం. అలాంటి పార్క్‌ను మాకు దూరం చేస్తాం, నాశనం చేస్తామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు.అభివృద్ధి పనులను దూరం చేస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. మా ఊరు జోలికి వస్తే ఎవరినీ వదలం. - గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్, తుమ్మలగుంట

తుడా చైర్మన్‌గా దివాకర్‌రెడ్డి



డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా డాలర్స్ దివాకర్‌రెడ్డి పేరును ప్ర భుత్వం ఖరారు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 22 నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లా పరిధిలో నలుగురికి చోటు లభించింది.

ఆశావహులకు భంగపాటు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు మబ్బుదేవ నారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి నుంచి శంకర్‌రెడ్డి, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆశీస్సులతో బడి సుధాయాదవ్, నగిరి నియోజకవర్గానికి చెందిన ఓ కాంట్రాక్టర్ తుడా చైర్మన్ కోసం పోటీ పడ్డారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సైతం చివరి వరకు పైరవీలు చేశారు. అనేక మంది ఆశావహులు పోటీపడి భంగపడ్డారు. చివరికి మంత్రి లోకేష్ ఆశీస్సులతో దివాకర్ రెడ్డికే తుడా చైర్మన్‌గిరి దక్కింది. నామినేటెడ్ పదవులు ప్రకటించడంతో తిరుపతిలోని టీడీపీ ముఖ్యనేతలంతా అసంతృప్తిలో ఉన్నారు.

అసంతృప్తిలో సీనియర్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నాలుగు నామినేటెడ్ పదవులను ప్రకటించారు. ఇందులో తుడా చైర్మన్ సహా మిగిలిన పోస్టుల భర్తీ పై అసంతృప్తి సెగలు వ్యక్తమవుతున్నాయి. తమకు పనికిరాని పదవులు కట్టబెట్టారని మండిపడుతున్నారు. ఈ పదవులు నాలుక మీద గీసుకునేందుకు కూడా పనికిరావని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్లకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ పార్టీ అధిష్టానం పై రగిలిపోతున్నారు.

నామినేటెడ్ పదవుల్లో పలువురికి చోటు

చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కూటమి నాయకులకు పదవులు వరించాయి. ఇందులో రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కుప్పంకు చెందిన రాజశేఖర్, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా తిరుపతికి చెందిన సుగుణమ్మ, తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా తిరుపతికి చెందిన దివాకర్‌ను, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా తిరుపతికి చెందిన పసుపులేటి హరిప్రసాద్‌ను నియమించింది.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 85,078 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 35,791 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.67 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వస్తే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

ఎరచ్రందనం పట్టివేత


పట్టుబడిన ఎరచ్రందనంతో అటవీశాఖ అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని మామండూరు సమీపంలోని ఊటగుంట వద్ద 10 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం వేకువజామున కడప–రేణిగుంట రహదారిలో గస్తీ నిర్వహిస్తుండగా కర్ణాటక రిజిస్ట్రేషన్ వాహనం అనుమానాస్పదంగా వెళ్లడంతో అటవీ సిబ్బంది వెంబడించారు. దీంతో వాహనం వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. అందులో సుమారు రూ.4లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను గుర్తించారు. అటవీ అధికారులు సుదర్శన్‌రెడ్డి, గౌస్‌కరీమ్, కుమార్, శరవణకుమార్, జాన్ శామ్యూల్, అరవింద్ పాల్గొన్నారు.

- శ్రీహరి బస్టాండ్‌ను పడగొట్టాలని నివేదిక సమర్పించిన నిపుణులు
- అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం
- కూలగొట్టేందుకు రూ.18లక్షలు కేటాయింపు
- టెండర్లు ఆహ్వానించిన ఆర్టీసీ అధికారులు

శ్రీహరి.. కూల్చివేతే సరి!



తిరుపతి అర్బన్ : తిరుపతిలోని శ్రీహరి బస్టాండ్‌ను కూల్చేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇటీవల బస్టాండ్ స్థితిగతులను ఇంజినీరింగ్ నిపుణులు పరిశీలించి నివేదిక సైతం సమర్పించారు. ఈ క్రమంలో కూల్చివేతకు సంబంధించి ప్రభుత్వం సైతం అనుమతులు మంజూరు చేసింది. ఇందుకోసం రూ.18లక్షలు వెచ్చించాలని ఆదేశించింది. దీంతో ఆర్టీసీ అధికారులు టెండర్లు సైతం ఆహ్వానించారు. ఆదివారం ఈ మేరకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ వరకు టెండర్లు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. 31వ తేదీలోపు టెండర్లు ఖరారు చేస్తామని, జూన్ మొదటి వారానికి కూల్చివేత పనులు పూర్తి చేయనున్నట్లు వివరించారు. అనంతరం రూ.45లక్షలతో తాత్కాలికంగా రేకులతో నిర్మాణాలు చేపడతామని తెలిపారు.

మల్టీ మోడల్‌కు కలేనా?

తిరుపతి బస్టాండ్‌కు నిత్యం 1.10లక్షల నుంచి 1.20 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రెండేళ్ల క్రితం మల్టీ మోడల్ బస్టాండ్ పేరుతో రూ.500కోట్లు వెచ్చించి 11 అంతస్తులతో ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మించాలని నిర్ణయించారు. ఆ మేరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని అనుమతులు పొందారు. వాస్తవానికి గత ఏడాది ఆగస్టులో మల్టీ మోడల్ బస్టాండ్ పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో ఈ పనులను గాలికివదిలేశారు.

దశలవారీగా పనులు

తిరుపతి శ్రీహరి బస్టాండ్‌లో ప్రస్తుతం 18 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. దశలవారీగా ఈ బస్టాండ్‌ను పడగొట్టనున్నారు. తొలి విడతలో అత్యంత ప్రమాదస్థితిలో ఉన్న మొదటి 6 ప్లాట్‌ఫామ్‌ను కూల్చివేయనున్నారు. రెండో దశలో 12వ ప్లాట్‌ఫామ్ వరకు, 3 దశలో 18వ ప్లాట్‌ఫామ్ వరకు కూల్చివేత పనులు చేపట్టనున్నారు.

ఏడు దశాబ్దాల చరిత్ర

తిరుపతిలోని శ్రీహరి బస్టాండ్‌కు ఏడు దశాబ్దాల చరిత్ర ఉంది.ప్రస్తుతం ఈ బస్టాండ్ భవనం ఇప్పుడు పూర్తిగా దెబ్బతింది. వర్షం వస్తే శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఏ క్షణం అయినా కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. అందుకే తొలగించాలని నిర్ణయించారు. సుమారు 70 ఏళ్ల క్రితం 13 ఎకరాల స్థలంలో బస్టాండ్ ఏర్పాటు చేశారు. అందులో తొలిసారిగా శ్రీహరి పేరుతో 18 ప్లాట్‌ఫామ్‌లతో బస్టాండ్ నిర్మించారు. అనంతరం ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదే ప్రాంగణంలో శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు పేరుతో మరో మూడు బస్టాండ్లు ఏర్పాటు చేశారు.


దుస్థితిలో శ్రీహరి బస్టాండ్


ఊడిపడుతున్న స్లాబు


బస్టాండ్‌లో తొలగించనున్న ప్రాంతం

గంగమ్మకు ఎంపీ గురుమూర్తి సారె



శ్రీతాతయ్యగుంట గంగమ్మతల్లిని ఎంపీ గురుమూర్తి దంపతులు దర్శించుకున్నారు. ఆదివారం ఈ మేరకు జాతర సందర్భంగా గంగమ్మకు భక్తి ప్రపత్తులతో సంప్రదాయ సారెను సమర్పించారు. ఈ క్రమంలోనే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తిరుపతి కల్చరల్

విలువలే వెంగమాంబ రచనలు


మాట్లాడుతున్న ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : తరిగొండ వెంగమాంబ రచనల్లో భక్తి, నైతిక విలువలే కనిపిస్తాయని కడప యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు నల్లపరెడ్డి ఈశ్వర్‌రెడ్డి కొనియాడారు. కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 295వ జయంతోత్సవాల సందర్భంగా ఆదివారం తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు నిర్వహించారు. ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ధ్యానం చేసే వారికన్నా ధాన్యం తయారు చేసే వారే గొప్పని తెలిపారు. అనంతరం వెంగమాంబ రచించిన నృసింహ శతకం వైశిష్ట్యంపై ఉపన్యసించారు. . ప్రతి మనిషిలో దయ, శక్తి, నిజం మాట్లాడే స్వభావం ఉంటే, దేవుడు అందరిలో కనిపిస్తారనే భావన వెంగమాంబ రచనల్లో దర్శనమిస్తుందన్నారు. పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ వి.కృష్ణవేణి మాట్లాడుతూ తిరుమలలో జీవ సమాధి కేవలం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వారికే ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల కళాకారులు ప్రదర్శించిన సంగీత కచేరి, హరికథ గానం భక్తులను ఆకట్టుకుంది. అంతకు ముందు తరిగొండ వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో శ్వేత ఇన్‌చార్జి సంచాలకుడు కె.రాజగోపాలరావు, తిరుపతి కేంద్రీయ విద్యాలయం విశ్రాంత ప్రిన్సిపాల్ మునిగోటి వేణుగోపాల్, డాక్టర్ సంగీతం కేశవులు, ఏఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తేనే భవిత



విద్యార్థులతో సురేష్, నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తేనే బంగారు భవిత సాధ్యమని సివిల్స్ విజేత పామూరి సురేష్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో గీతా గోవిందం సేవా సమితి ఆధ్వర్యంలో పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ ఆసక్తికి అనుగుణంగా లక్ష్యం నిర్దేశించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో గీతాగోవిందం సేవా సమితి అధ్యక్షుడు దామోదర్‌రావు, కార్యదర్శి వరదరాజులు పాల్గొన్నారు.

గోనుపల్లి వద్ద ఘోరం!

- బోల్తా పడిన ట్రక్కు ఆటో
- పలువురికి గాయాలు




క్షతగాత్రులు, రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ..

రాపూరు: మండలంలోని గోనుపల్లి వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా.. పది మందికిపైగా స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. అన్నమయ్య జిల్లా, పుల్లంపేట మండలం, పెరింపాడు గ్రామానికి చెందిన కుటుంబీకులు సుమారు 23 మంది రాపూరు మండలం, పెంచలకోనలో జరిగే బ్రహ్మోత్సవాలకు ట్రక్కు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను తప్పించబోయి ట్రక్కు ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న పెరింపాడుకు చెందిన శివయ్య, రాధమ్మ, నారాయణమ్మకు తీవ్ర గాయాలు కాగా.. మరో పది మందికిపైగా స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది, పోలీసులు, హైవే మొబైల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.



జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక రేపు

నాయుడుపేట టౌన్ : పెళ్లకూరు మండలం రోసనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జిల్లా రెజ్లింగ్ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ ఆదవరం అనుదీప్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అండర్–23 విభాగం క్రీడాకారులు 2002–06 మధ్య, అండర్– 17 విభాగం వారు 2008–10 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డులను తప్పనిసరిగా తీసుకువాలని సూచించారు. అసోసియేషన్ సెక్రటరీ, కోచ్ ఉదయ్ కుమార్, ప్రెసిడెంట్ ఎస్.సురేష్ నేతృత్వంలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 90000 24837లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఘటనాస్థలంలో ఎస్‌ఐ చిన్న బలరామయ్య

చిట్టమూరు : నాయుడుపేట–మల్లా రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. కోట మండలం జరుగుమల్లికి చెందిన ఉదయగిరి సుధీర్(24) నాయుడుపేట మండలం మేనకూరు వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కోటలో తన స్నేహితుడి పెళ్లికి వెళ్లేందుకు మరో మిత్రుడు శివతో కలిసి బైక్‌పై బయదేరాడు. మార్గం మధ్యలో చిట్టమూరు మండలం కొత్తగుంట వద్ద ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధీర్ అక్కడికక్కడే మరణించాడు. శివ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ చిన్న బలరామయ్య వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ఏరియా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

– ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

చంద్రగిరి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. తిరుపతికి చెందిన సహదేవ్, అల్తాఫ్ పలమనేరు నుంచి తిరుపతి వైపుగా బుల్లెట్ వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన మురళి తిరుపతి నుంచి చిత్తూరు వైపుగా కారులో వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సహదేవ్‌తో పాటు అల్తాఫ్ తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్సపొందుతూ మహిళ మృతి

తిరుపతి రూరల్ : అగ్నిప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న మహిళ ఆదివారం మృతి చెందింది. వివరాలు.. తిరుపతి రూరల్ మండలం పైడిపల్లికి చెందిన ఆనందమ్మ (65) ఈనెల 9వ తేదీన దీపం తగిలి చీరకు నిప్పు అంటుకోవడంతో గాయపడింది. రుయా ఆస్పత్రిలో రెండు రోజులుగా చికిత్సపొందుతూ మరణించింది. మృతురాలి కుమారుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్‌షావల్లీ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించినట్లువ వెల్లడించారు.

● గరుడుడిపై లక్ష్మీనరసింహుడు



పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారు యోగనరసింహుడి అలంకరణలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రాత్రి గరుడ వాహన సేవంపై కోన వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

- రాపూరు

టీటీడీలో డెప్యూటీ ఈఓల బదిలీ


హరేంద్రనాథ్

తిరుమల: టీటీడీ డెప్యూటీ ఈఓలను బదిలీ చేస్తూ సంబంధిత ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. తిరుమల రిసెప్షన్–2 డిప్యూటీ ఈఓ హరేందర్‌నాథ్‌ను తిరుచానూరుకు బదిలీ చేయగా.. అక్కడ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న గోవిందరాజను పూర్తి స్థాయిలో హెచ్‌ఆర్ డిప్యూటీ ఈఓగా కొనసాగనున్నారు. తిరుమల రిసెప్షన్ డిప్యూటీ ఈవో–1 గా ఉన్న భాస్కర్‌కు రిసెప్షన్ టూ డిప్యూటీ ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం నుంచి తిరుమల ఎస్టేట్ అధికారిగా పనిచేస్తున్న మల్లికార్జునరావును తిరిగి మాతృ సంస్థకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సీనియారిటీ జాబితాను పరిశీలించుకోండి

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లు ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలను పరిశీలించుకోవాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎస్జీటీ క్యాడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ నుంచి గ్రేడ్– 2 హెచ్‌ఎం ఉద్యోగోన్నతులు త్వరలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రెండు విడతలుగా సీనియారిటీ జాబితాలు విడుదల చేశామన్నారు. టీచర్ల నుంచి అందిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత ప్రస్తుతం మరో సారి సీనియారిటీ జాబితాను విడుదల చేశామన్నారు. ఈ జాబితాలను www.chittoordeo.com వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని డీఈఓ తెలిపారు.

కుయుక్తులతో కూటమి కుమ్మక్కు!

- ఎట్టకేలకు ముక్కంటి ఆలయ పార్కింగ్ టెండర్ కైవసం
- ప్రశ్నార్థకంగానే శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి వాటా


స్వర్ణముఖి నదిలో పార్కింగ్ చేసిన వాహనాలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ పార్కింగ్ టెండర్‌ను కూటమి నేతలు కుమ్మక్కై దక్కించుకున్నారు. దేవదాయశాఖ అంచనాల మేరకు బిడ్ రావడంతో కారు పార్కింగ్ టెండర్ ఖరారైంది. అయితే కూటమి నేతలు దౌర్జన్యంతో వేరే వారు ఎవరూ టెండర్ వేయకుండా భయభ్రాంతులకు గురిచేశారు.

తక్కువగా కొట్టేయాలని..

గతంలో సుమారు కారు పార్కింగ్ టెండర్ రూ.కోటి వరకు ఉండేది. అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ, జనసేన నేతలు ఎలాగైనా తక్కువకే టెండర్ కొట్టేయాలని యత్నించారు. టెండర్ వేయడానికి ఎవరూ వేయకూడదని హుకుం జారీ చేశారు. తక్కువకు కోట్ చేసి టెండర్ దక్కించుకోవడానికి ప్రయత్నం చేశారు. అయితే ఆలయం ఏడాదిగా పార్కింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో సుమారు రూ.2కోట్ల వరకు రాబడి వచ్చింది. ఇందుకోసం 30మంది ఆలయ ఉద్యోగులకు జీతభత్యాలు పోగా సుమారు రూ.1.50 కోట్ల వరకు ఆదాయం మిగిలింది. దీంతో రూ.1.5 కోట్లకు పైగా బిడ్ ఉంటేనే టెండర్ ఆమోదం తెలుపుతామని దేవదాయశాఖ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గత్యంతరం లేక కూటమి నేతలు యహిత అసోసియేట్స్, ఎస్టీ అసోసియేట్స్ అనే రెండు సంస్థల పేరుతో బిడ్‌లు వేశారు. చివరకు ఎస్టీ అసోసియేట్స్ రూ.1.59కోట్లకు టెండర్ దక్కించుకుంది.

ఎక్కడ పడితే అక్కడే..

స్వర్ణముఖి నది, గాలిగోపురం, శివయ్యగోపురం ఇలా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్‌చేస్తున్నారు. అలాగే నాలుగో గేట్ నుంచి ఒకటో గేట్ వరకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కార్పెట్‌పై సైతం వాహనాలు నిలిపేస్తున్నారు. దీనిపై పార్కింగ్ నిర్వాహకులు దృష్టి సారించాల్సిన అవసరముందని భక్తులు కోరుతున్నారు. ఈ క్రమంలోనే వాహనాలకు సరైన పార్కింగ్ చూపకుండా డబ్బులు వసూలు చేయడం వంటి అక్రమాలకు చోటు ఇవ్వవద్దని సూచిస్తున్నారు.

లోపాయికారీ ఒప్పందం

పార్కింగ్ టెండర్ ఎవరికి వచ్చినా ఇరు పార్టీల వారు పంచుకోవాలని టీడీపీ, జనసేన నేతలు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో జనసేన తరుపున యహిత రూ.1.55 కోట్లకు టెండర్ దాఖలు చేసినట్లు తెలిసింది. అయితే మరో రూ.4లక్షలు అదనంగా ఎస్టీ అసోసియేట్స్ రూ.1.59 కోట్లకు టెండర్ దక్కించుకుంది. ఇక పార్కింగ్ సొమ్మును ఇరు పార్టీ వారు పంచుకుంటారా.. లేక వివాదాలకు దిగుతారో వేచిచూడాల్సిందే.

మున్సిపాలిటీకి మొండిచెయ్యేనా?

శ్రీకాళహస్తి ఆలయానికి పార్కింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో మున్సిపాలిటీకి వాటా ఇవ్వాల్సి ఉంది. గతంలో సుమారు 30శాతం వాటాను పురపాలక సంఘానికి అందించేవారు. 201718లో ఆ వాటాను నిలిపివేశారు. దీంతో ఇప్పటి వరకు సుమారు రూ.2కోట్ల వరకు మున్సిపాలిటీకి రావాల్సి ఉంది. అలాగే స్కిట్ కళాశాలకు సంబంధించి మరో రూ.2కోట్ల బకాయి ఉంది. అసలే శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి ఆదాయ వనరులు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులకు అవకాశం లేకుండా పోతోంది. ప్రస్తుత పరిస్థితిలో ముక్కంటి ఆలయం ద్వారా రూ.4కోట్లు బకాయిలు విడుదల చేస్తే పట్టణాభివృద్ధికి ఉపయోగపడుతుందని స్థానికులు కోరుతున్నారు. అయితే పాలకులు ఆ దిశగా అడుగులు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పురపాలక కమిషనర్ గిరికుమార్ మాట్లాడుతూ పార్కింగ్‌కు సంబంధించి ఆలయం ద్వారా రావాల్సిన బకాయిలను ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు ఆలయ, దేవదాయశాఖ అధికారులకు విన్నవించినట్లు వెల్లడించారు.